
# మీటర్ లేని ఇండ్లు, షాపులే టార్గెట్




- విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారంటూ బెదిరింపులు
- కోటపల్లి మండలంలోని ఓ లైన్ మెన్ ఆగడాలు
- ఒక్కో మీటరు మంజూరుకు రూ.10 వేల చొప్పన వసూలు చేస్తున్నట్లు లైన్ మెన్ పై ఆరోపణలు
- కాంగ్రెస్ లీడర్ దగ్గరకు చేరిన పంచాయితీ
- కనెక్షన్ ఇస్తామంటూ సర్ది చెప్పే ప్రయత్నం
- డబ్బులు ఇవ్వకుండా, కనెక్షన్ ఇవ్వకుండా లైన్ మెన్ వేధింపులు



**శెనార్తి మీడియా, మంచిర్యాల( కోటపల్లి):**

అక్రమార్జనకు అలవాటు పడిన కొందరు విద్యుత్ అధికారులు కనెక్షన్ లేని ఇండ్లు, షాపులను టార్గెట్ చేస్తున్నారు. మీటర్ లేదని తెలిస్తే చాలు ఇక దొంగతనంగా కరెంట్ వినియోగించుకుంటున్నారని , కేసులు పెడతామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ బెదిరింపుల వ్యవహారం అంతా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం దేవులవాడలో చోటుచేసుకుంది. మీటర్ మంజూరు కోసం ఓ వ్యక్తి నుంచి రూ. 10 వేలు తీసుకొని రేపు, మాపు మొన్నటి దాటవేస్తూ వచ్చిన లైన్ మెన్ ఇప్పుడు ఏకంగా.. మీటర్ లేదు.. డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో.. ఎవరికి చెప్పుకుంటావో అంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఇలాగే మరికొందరి వద్ద కూడా డబ్బులు తీసుకొని మీటరు మంజూరు కాకుండా తిరస్కరణ(రిజెక్ట్)కు గురయ్యేలా చేస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

**తాను చెప్పిందే రూల్..**

"తాను చెప్పిందే రూల్" అన్నట్టుగా వ్యవహరించే లైన్ మెన్ రామకృష్ణ, డబ్బులు ఇవ్వకపోతే కరెంట్ కట్ చేస్తానని బెదిరించడం, డబ్బులు ఇచ్చాకే లైన్ ఇస్తున్నాడంటూ స్థానికులు ఆరోపిస్తున్నాయి. ఎర్రాయిపేటలో 100 మీటర్ల దూరంలో మీటర్ ఇచ్చిన సంఘటన, తాజాగా రాపనపల్లి దాబాకు 300 మీటర్ల దూరంలో కూడా కనెక్షన్ ఇచ్చిన ఘటనలు అక్రమాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

అల్లా రమేష్ అనే దాబా యజమాని మీటరు కోసం దరఖాస్తు చేయగా, "డబ్బులు ఇస్తేనే ఆన్ లైన్ మంజూరుకు అనుమతి వస్తుందంటూ బెదిరింపులకు గురి చేశాడు. డబ్బులు ఇవ్వకపోడంతో చివరికి దరఖాస్తును సైతం తిరస్కరించాడని బాధితుడు ఆరోపిస్తున్నాడు. చిన్న కిరాణ షాపుల వద్దకూ వెళ్లి కేటగిరీ–2 లేదు" అంటూ కేసులు పెడతానని బెదిరించి వసూళ్లు చేస్తున్నాడనే ఆరోపణలు సైతం ఉన్నాయి. లక్ష్మీపూర్‌లో నాగుల పద్మ అనే మహిళ వద్ద పలుమార్లు రూ. 2,000 నుంచి రూ. 5,000 వసూలు చేసిన ఘటనను గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. ఇదే రామకృష్ణ గతంలో కోటపల్లిలో ఇలాంటి ఆరోపణలతో కొమ్మెరకు బదిలీ అయ్యాడు. కానీ డబ్బుల వసూళ్లకు అలవాటు పడిన రామకృష్ణ తిరిగి బదిలీ చేయించుకొని కలెక్షన్ కింగ్‌గా మారాడని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. "రామకృష్ణ ఆగడాలు అందరికీ తెలిసినా, ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు..?" అనే ప్రశ్న స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నది.

**అధికార పార్టీ నాయకుడి వద్దకు చేరిన ముడుపుల వ్యవహారం**

దాబా యజమాని అల్లా రమేష్ నియోజకవర్గంలో పేరొందిన అధికార పార్టీ నాయకుడిని కలిసి తన గోడును వెళ్లబోసుకున్నాడు. దీంతో సదరు నాయకుడు లైన్ మెన్ కి ఫోన్ చేయగా, కనెక్షన్ ఇస్తానంటూ ఫోన్ లో సర్ది చెప్పే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత యథావిధిగా బాధితుడిపై తన విశ్వరూపం చూపాడు. నీకు కనెక్షన్ ఇచ్చేది లేదంటూ మరింత బెదిరింపులకు గురి చేశాడు. విజిలెన్స్ అధికారులు రమేష్ దాబాలో తనిఖీ చేసి రూ. 1200 జరిమానా వేశారు. ఈ విషయమై మంచిర్యాల ఎస్ఈ ఉత్తమ్ జాడేను వివరణ కోరగా 30 మీటర్ల కంటే దూరం ఉంటే కనెక్షన్ ఇవ్వడానికి అనుమతి లేదు. నిబంధనలు విస్మరించి కనెక్షన్ ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. లైన్ మెన్ డబ్బులు తీసుకున్న విషయం తన దృష్టికి రాలేదని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# మహిళల ఆర్థిక బలోపేతానికి చేయూత



- మత్స్య సంఘాలకు రూ. 21 వేల కోట్లు
- మంత్రి వివేక్ వెంకటస్వామి

**శెనార్తి మీడియా, మంచిర్యాల (భీమారం):**

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మత్స్యశాఖ మహిళా సంఘాలకు చేయూత అందిస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం భీమారం మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ భవనంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్‌లతో కలిసి మత్స్యకారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడేందుకు ఇందిరా మహిళా శక్తి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ద్వారా సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. భీమారం మండల కేంద్రంలో మహిళా సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసినట్లు వివరించారు. జిల్లాలో 132 సంఘాలు నమోదు అయ్యాయని, సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల మహిళా సంఘాలకు 21 వేల కోట్ల రూపాయలు కేటాయించామని, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కోసం 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ఫలాలు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి అన్నారు. అనంతరం 134 మంది మత్స్యకార సంఘ సభ్యులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**చెన్నూర్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల (చెన్నూర్):** చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తహసీల్దార్ మల్లికార్జునతో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.తరువాత గోదావరి పుష్కర ఘాట్‌ను పరిశీలించిన మంత్రి, 2027 పుష్కరాల కోసం త్రాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు వంటి సదుపాయాలు కల్పించేలా ముందస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు, ఇతరులకు పార్కింగ్ నుండి నడక ఏర్పాట్లు ఉంటాయని వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాజీమార్గమే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ వీరయ్య




**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 3,500 కేసులు పరిష్కరించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ వీరయ్య తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఇరువర్గాలకూ న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. "రాజీమార్గమే రాజమార్గం" అని గుర్తుచేస్తూ, దేశ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా, తాలూకా స్థాయిలలో లోక్ ఆధాలాత్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో 9 లోక్ ఆధాలాత్ బెంచ్‌లను ఏర్పాటు చేసి విచారణ జరిపినట్లు తెలిపారు. ఈ విధానంతో కేసులు వేగంగా పరిష్కారమవ్వడమే కాకుండా, అప్పీలు అవసరం లేకుండా ఇరువర్గాలూ గెలిచినట్టుగా తీ ర్పులు అమల్లోకి వస్తాయని న్యాయ మూర్తి అన్నారు. పరిష్కరించిన కేసుల్లో 30 సివిల్ దావాలు, 15 వాహన పరి హారం కేసులు, 339 క్రిమినల్ కేసులు, 3,100 ఇతర కేసులు, 43 సైబర్ క్రైమ్ కేసులు, 45 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయని వివరించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి నిర్మల, సీనియర్ సివిల్ జడ్జి డి. రామమోహన్ రెడ్డి, జూని యర్ సివిల్ జడ్జిలు కవిత, నిరోష, కృష్ణ తేజ, బార్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

# సామరస్యంతో ముందుకు సాగాలి



- గిరిజనులతో కలెక్టర్ చర్చ

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల కలెక్టర్ ఛాంబర్‌లో డీసీపీ ఎ.భాస్కర్ సమక్షంలో దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో ఆయన సమావేశమయ్యారు. దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాలలో జరిగిన ఘటనలపై గిరిజనులతో చర్చించి, శాశ్వత పరిష్కారం కోసం సామరస్యంగా ముందుకు సాగాలని సూచించారు. అటవీ ప్రాంతాలలో కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్మెంట్ ద్వారా వెదురు పంట సాగు కొనసాగుతోందని, ఇందుకోసం గుంతలు త్రవ్వడం, నీరు అందించడం, ఎరువులు సమకూర్చడం వంటి పనులకు ప్రభుత్వం నిధులు ఇస్తోందని వివరించారు. వెదురు పంట విక్రయానికి సదుపాయాలు కల్పించి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, గిరిజనులు ఆర్థికంగా ఎదగడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, దాడులకు పాల్పడకుండా శాంతియుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు, గిరిజన ప్రతినిధులు పాల్గొన్నారు.




# అక్టోబర్ 31లోగా సిఎంఆర్ పూర్తి చేయాలి

- రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

2024–25 రబీ సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదా యంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులు, రైస్ మిల్లర్ల సంఘ ప్రతిని ధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని ప్రతిరోజూ మిల్లింగ్ చేసి సిఎంఆర్ చేయాలని సూచించారు. గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయని మిల్లులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, అధికారులు పాల్గొన్నారు.




# ఉత్సాహంగా హిందీ దివస్

- ఎథిక్ అకాడమీ విద్యార్థుల ప్రత్యేక ప్రదర్శన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

హిందీ దివస్ సందర్భంగా ఎథిక్ అకాడమీ ది ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు 'అ' అక్షర ఆకారంలో నిలబడి అందరి దృష్టిని ఆకర్షించారు. హిందీ భాష ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తూ స్కిట్స్, ప్రసంగాలతో సందేశాన్ని అందించారు. డైరెక్టర్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, "హిందీ దేశాన్ని ఏకం చేసే భాష. చిన్నారుల్లో భాషపై ఆసక్తి పెంచడం మా ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.



# యువత అన్ని రంగాల్లో రాణించాలి

- ఆలుగామ మాజీ సర్పంచ్ మారిశెట్టి వెంకటస్వామి

**శెనార్తి మీడియా, మంచిర్యాల (కోటపల్లి):** యువత చదువుతో పాటు సాంస్కృతిక, దైవ, క్రీడా రంగాలలో రాణించాలని ఆలుగామ మాజీ సర్పంచ్ మారిశెట్టి వెంకటస్వామి పిలుపునిచ్చారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.15 వేలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దుర్గం బాపు, కొండగుర్ల నాందేవ్, జెట్టి రాంచేంద్రు, గోమాస ప్రవీణ్, కొండగుర్ల రామయ్య, దుర్గం అంకయ్య, దాగం వాలిహైధర్, కొండగుర్ల రాజారాం, కుమ్మరి లింగమూర్తి, గోమాస లింగయ్య, దుర్గం సత్యం, దుర్గం వెంకటి, జెట్టి సురేష్, మాజీ వార్డు సభ్యులు దుర్గం బాపు, మారిశెట్టి సురేష్, చాకటి శేఖర్ పాల్గొన్నారు.

# షీటీం అదుపులో పోకిరీలు

- రాముని చెరువు వద్ద ఈవ్‌టీజింగ్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

జిల్లా కేంద్రంలోని రాముని చెరువు ఉద్యానవనం వద్ద అల్లరి చేస్తూ, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి తెలిపారు. కొంత కాలంగా అక్కడ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. శనివారం నలుగురిని పట్టుకొని షీటీం కార్యాలయానికి తరలించామని తెలిపారు. అనంతరం తల్లిదండ్రుల



సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని ఉషారాణి వివరించారు.

# బాలికను వేధించిన యువకుడి అరెస్ట్

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండ లం అంబల్పూర్ గ్రామానికి చెందిన రావనవేణి హరీష్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ బాలికను వేధిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మేజిస్ట్రేట్ ఎదు ట హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజు ల రిమాండ్ విధించారని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

**ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి**

గద్దపాక గ్రామానికి చెందిన నిమ్మరాజు రాజు (55) ప్రమాదవశాత్తు మృతి చెందాడు.సెప్టెంబర్ 9న రాత్రి 11 గంటల సమయంలో నీళ్లు తాగేందుకు లేచిన ఆయన నిద్రమత్తులో ఇంట్లో కాలు జారి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో గట్టిగా రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యు లు పరిస్థితి విషమంగా ఉందని, శస్త్రచికిత్స అవసరమని తెలిపారు.తరువాత హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సెప్టెంబర్ 13న ఉదయం 6.45 గంటలకు మరణించాడు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.